సాక్షి వికారాబాద్

ఆదివారం । 9 । జూలై । 2023



వంటకు ధరల సెగ

కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితికి చేరుకున్నాయి. 8లో▸



బ్రిడ్జి నిర్మాణం కలేనా?

వానాకాలంలో తాండూరు మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వాగులు పొంగి రాకపోకలు స్తంభిస్తున్నాయి. 8లో▸



వెట్టి చాకిరీ చేస్తున్నాం..

అరకొర జీతంతో కాలవెల్లదీస్తున్నామని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. వేతనాలు పెంచాలని కోరుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ముగిసిన న్యాయ సుధా పారాయణం



పారాయణంలో పాల్గొన్న పండితులు

కొడంగల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ప్రధాన ఆలయంలో వారం రోజులుగా శ్రీమాన్ న్యాయ సుధా పారాయణం నిర్వహించారు. కొడంగల్‌కు చెందిన వీరేషాచార్యులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన వరదాచార్యులతో పాటు మరో ఎనిమిది మంది పారాయణంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం పారాయణం ముగిసింది. టీటీడీలో విశేషమైన, అరుదైన సేవగా భావించే న్యాయ సుధా పారాయణంలో భాగంగా శ్రీవారి ఎదురుగా కూర్చొని ప్రతి రోజు నిర్వహించినట్లు వీరేషాచార్యులు తెలిపారు. పారాయణంలో పాల్గొన్న పండితులకు శ్రీవారి ఆలయం తరఫున దేవస్థానం ఆధ్వర్యంలో సన్మానం చేసినట్లు ఆయన చెప్పారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నారాయణపూర్ వాసి



నర్సింహులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నానపురం నర్సింహులుకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు అందాయి. నానపురం నర్సింహులు శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. గతంలో పెద్దేముల్ జూనియర్ కళాశాలలో కూడా పని చేశారు. తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పిస్తూ..ఉస్మానియ యూనివర్సిటీ పరిధిలోని శేరిలింగంపల్లి (బీహెచ్‌ఈఎల్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పోస్టింగ్ ఇచ్చారు. తెలుగు భాష సాహిత్యంపై పలు పరిశోధనలు చేశారు. తమ గ్రామానికి చెందిన నర్సింహులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మ గర్జనకు తరలిరండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం పురుషోత్తంరావు, సభ్యులు

తాండూరు: బ్రాహ్మణుల హక్కుల సాధన.. ఆత్మగౌరవం కోసం ఆదివారం నగరంలో జరిగే బ్రహ్మగర్జన సభకు బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరణం పురుషోత్తంరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్రహ్మగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్చక పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా సాధించుకునేందుకు ఈ సభ ఎంతో కీలకంగా మారుతోందన్నారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా హాజరుకావాలన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రారంభం

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేటలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ కోర్సులలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు కోర్సులలో మొత్తం 80మందికి అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలోనే అడ్మిషన్లు జారీ చేయనుండగా వచ్చే ఏడాది ద్వితీయ సంవత్సరానికి అప్‌గ్రేడ్ చేయనున్నారు. సోమవారం నుంచి అడ్మిషన్లు తీసుకోనున్నట్లు ప్రత్యేకాధికారి సుహాసిని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అనంతగిరి: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివరాంనగర్ కాలని చెందిన వడ్ల వేణుగోపాలచారి (20) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

'యాదిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తాం'

మొయినాబాద్: చౌరస్తాలో తెలంగాణ అమరవీరుడు మందడి యాదిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. పెద్దమంగళారంలో అమరుడు యాదిరెడ్డి తల్లి చంద్రమ్మకు ఎంపీ డబుల్ బెడ్‌రూం ఇల్లు, పెద్దమంగళారంలో 500 గజాల ఇంటి స్థలం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



వానలు కురవడంతో కళకళలాడుతున్న కంది, మినుము పంట

పంటలకు జీవం.. ఆశలు సజీవం

వానదేవుడు కరుణించడంతో పంటలన్నీ కళకళలాడుతున్నాయి. నాలుగైదు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వానలు పంటలకు జీవం పోశాయి. ఇప్పటి వరకు ఇంకా విత్తనాలు విత్తని రైతులు సాగు పనుల్లో నిమగ్న మయ్యారు. పొలాల్లో మహిళలు కలుపులు తీస్తున్నారు. అరకలు కట్టి సాల్ల మధ్య గడ్డి తొలగిస్తున్నారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఇక పంటలకు ఢోకాలేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– బషీరాబాద్



జీవన్గీ దగ్గర పెసర పంట ఇలా..

పల్లెలు.. ప్రగతి మల్లెలు



జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న చీమల్‌దరి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



గ్రామంలో ఏర్పాటుచేసిన పార్కు

అంతర్జాతీయ ప్రమాణాల వైపు పంచాయతీలు

- ఏకంగా నాలుగు జీపీలకు ఐఎస్ఓ గుర్తింపు
- మరో పంచాయతీకి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు
- చీమల్‌దరికి జాతీయ స్థాయిలో రెండో స్థానం
- భారీగా పారితోషికాలు అందజేత

వికారాబాద్ : మన గ్రామ పంచాయతీలు అంతర్జాతీయ ప్రమాణాలవైపు పయనిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే నాలుగు జీపీలు అంతర్జాతీయ ప్రమాణాల కలిగిన జీపీలుగా సర్టిఫికెట్లు అందుకోగా పదుల సంఖ్యలో జీపీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఏడాది ఏకంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో మన పల్లెలే ముందు వరుసలో నిలిచాయి. జిల్లాలో 566 జీపీలు ఉండగా ఇందులో నాలుగు గ్రామ పంచాయతీలు ఐఎస్ఓ గుర్తింపు అవార్డులు అందుకోగా ఒక జీపీ కేరళ రాష్ట్రాన్ని సైతం వెనక్కి నెట్టి జాతీయ అవార్డు దక్కించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 12 జీపీలు ఐఎస్ఓ (ఇంటర్‌నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్స్) అవార్డులు అందుకోగా అందులో మన జిల్లా నుంచే నాలుగు ఉండటం విశేషం. జాతీయ స్థాయిలో ముందు వరుసలో నిలిచిన చీమల్‌దరి గ్రామంలో ఫ్రీగా వైఫై సౌకర్యం, సోలార్ లైట్ల వినియోగం, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్, సేవలన్నీ ఆన్‌లైన్, ప్రతి వీధికి పేర్లు, ఇంటి నంబర్లతో వీధి ఆరంభంలో బోర్డులు, అందమైన పార్కులు, ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి.

జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన జీపీలివే..

జిల్లాలో 566 జీపీలు ఉండగా జిల్లా యంత్రాంగం జీపీల పనితీరు నిశితంగా పరిశీలించి మండల స్థాయి నుంచి 54 పంచాయతీలను జిల్లా స్థాయికి ఎంపిక చే శారు. ఇందులో 27 జీపీలు జిల్లా స్థాయి ఉత్తమ జీపీలుగా అవార్డు అందుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఇలా ఎంపిక చేసి పంపిన జీపీల్లో చీమల్‌దరి జీపీ జాతీయ స్థాయిలో రెండో స్థానం నిలువగా, గుడ్ గవర్నెన్స్(సుపరిపాలన) విభాగంలో మొదటి బహుమతి దక్కించుకుంది. పులిమద్ది, ఎల్లకొండ, కరన్‌కోట్, చీమల్‌దరి గ్రామాలు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన జీపీలుగా ఎంపికయ్యాయి. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ సమతుల్యం, నాణ్యమైన సేవల్లో జీపీలకు అవార్డుల పంట పండింది. ఐదారు సంవత్సరాల క్రితం వరకు ఇళ్ల మధ్య మురుగు..రోడ్లపైనే చెత్త.. రోడ్లకు ఇరువైపులా పెంట కుప్పలతో దర్శనమిచ్చే పల్లెలు నేడు పార్కులు, పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, అందమైన సీసీ రోడ్లతో అలరారుతున్నాయి.

పలు అంశాలతో..

ఉత్తమ గ్రామ పంచాతీల ఎంపికలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆ గ్రామంలో జరిగిన ప్రగతి, తడి, పొడి చెత్త వేరుచేసే సిస్టం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వాటిని వాడటం, రోడ్లు, మురుగు కాల్వల పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, హరితహారం, ఇంకుడు గుంతలు, విద్య, వైద్యం, బడి బయటి పిల్లలు, పౌష్టికాహారలోపం, ఇమ్యునైజేషన్, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. వీటితో పాటు అక్షరాస్యత పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు సైతం పరిగణలోకి తీసుకున్నారు.

కలిసికట్టుగా పనిచేశాం



జిల్లాకు ఎక్కువ అవార్డులు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేశాం. కలెక్టర్ పర్యవేక్షణలో యంత్రాంగమంతా కలిసికట్టుగా కదిలింది. మూడు విభాగాల్లో తొమ్మిది థీమ్స్ ఆధారంగా అవార్డుల కోసం పంచాయతీల వివరాలను సైట్‌లో ఎంట్రీ చేశాం. మొత్తం 27 జీపీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. జిల్లాకు ఎక్కువ అవార్డులు రావటం ఆనందంగా ఉంది. ఇందులో అందరి కృషి, సహకారం ఉంది.

– తరుణ్‌కుమార్, డీపీఓ

బాధ్యత మరింత పెరిగింది



మా గ్రామానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు రావటం సంతోషంగా ఉంది. దీంతో గ్రామానికి సందర్శకుల తాకిడి పెరిగింది. మాపై బాధ్యత మరింత పెరిగింది. గ్రామాభివృద్ధిలో అధికారులు, ఉద్యోగులు, జీపీ సభ్యులు, ప్రజల సహకారం ఉంది. ఇప్పటికే మూడున్నర కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. అవార్డుల ద్వారా వచ్చే నిధులతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– నర్సింహారెడ్డి, సర్పంచ్, చీమల్‌దరి

ఎన్నికలకు సమాయత్తం



జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు (ఫైల్)

- ఓటరు జాబితాలో బిజీబిజీ
- పోలింగ్ కేంద్రాల పరిశీలన
- మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- 'అసెంబ్లీ' హడావుడి ప్రారంభం

కొడంగల్: జిల్లాలో అధికారులు అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. ఓటరు జాబితా పనిలో బిజీగా ఉన్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఓటరు జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అక్టోబర్ నెలలో కొత్త ఓటరు జాబితా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను గమనిస్తున్నారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. గ్రామాలు, పట్టణాలు, మండలాల్లోని బూత్ లేవల్ అధికారులు సూపర్‌వైజర్లతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఈ నెల చివరి వరకు జాబితాను సిద్ధం చేయనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది.

క్షేత్ర స్థాయి పరిశీలన

పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం.. వెలుతురు.. నీటి వసతి.. మూత్ర శాలలు వంటి కనీస మౌలిక సదుపాయాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తున్నారు.పోలింగ్ కేంద్రం ఓటర్లకు దూరంగా ఉన్నా.. 1200 ఓట్లకు పైగా ఉన్నా మరో కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పాత కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకుంటే సమీపంలోనే మరో కేంద్రాన్ని గుర్తించాల్సి ఉంది. దివ్యాంగులకు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు చేయాల్సి ఉంది.ప్రతి కేంద్రాన్ని ఫొటో తీసి ఎన్నికల సంఘానికి పంపించాల్సి ఉంది.

ఆగస్టులో ముసాయిదా

ఈ ఏడాది జనవరి 5న ఎన్నికల సంఘం ఓటరు జాబితాను ప్రకటించింది. వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల వివరాలు ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సవరణతో పాటు ఇంటింటి సర్వే చేశారు. 2023 అక్టోబర్ 25 నాటికి 18 ఏళ్ల నిండిన వారికి మే 25 నుంచి జూన్ 23 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. క్షేత్ర స్థాయిలో ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఈనెల 25 నుంచి 31 వరకు జాబితా పరిశీలన, ఆగస్టు 2న ముసాయిదా జాబితా విడుదల, 31 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపడతారు. సెప్టెంబర్ 22న అభ్యంతరాలపై తుది వివరణ ఇస్తారు. అనంతరం అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు. 2023 డిసెంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు అదే ఫైనల్ జాబితా కానుంది.

జాబితాలో సవరణలు



ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని ఓటరు జాబితాను సవరిస్తున్నాం. అన్ని మండలాల్లో ఇప్పటికే పలు దరఖాస్తులు వచ్చాయి. బూతు లేవల్ అధికారులు గ్రామాల్లో పర్యటించి వలస వెళ్లిన వారి వివరాలు, చనిపోయిన వారి వివరాలు సేకరించారు. పేర్లలో తప్పు ఒప్పులు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నమోదు చేస్తున్నాం. జాబితా సిద్ధమైన తర్వాత ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– బుచ్చయ్య, తహసీల్దార్ కొడంగల్



పెచ్చులూడుతున్న పైకప్పు

ప్రమాదకరంగా రాంసింగ్ నాయక్‌తండా అంగన్‌వాడీ కేంద్రం

చౌడాపూర్ మండలం రాంసింగ్‌నాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. అసలే వర్షాకాలమని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారులు, వారి తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– కుల్కచర్ల



గెట్‌టు గెదర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, పూర్వవిద్యార్థులు

ఇంటర్ దోస్తుల్లో 'ఆనంద'ం

- కళాశాల మిత్రులతో ఎమ్మెల్యే

అనంతగిరి: అనంతపద్మనాభ కళాశాలలో 1991–1993 ఇంటర్మీడియెట్ బీపీసీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం వికారాబాద్ మండలంలోని ఓ రిసార్ట్స్‌లో జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సైతం ఈ బ్యాచ్‌కు చెందినవారే. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. మిత్రులతో సరదాగా మాట్లాడుతూ, కళాశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, వారి జీవిత విశేషాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. మధుర జ్ఞాపకాలతో మరుపురాని అనుభూతితో మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఆరో రోజూ సామూహిక యాగాలు



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులు

తాండూరు పట్టణంలో జరుగుతున్న రాజశ్యామల, శతచండి, సౌర, లక్ష్మీసుదర్శన, అతిరుద్ర మహాయాగాలు శనివారం 6వ రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యాగ క్రతువులో భాగంగా ఎమ్మెల్యే నివాసం నుంచి భావిగి భద్రేశ్వర దేవాలయం వరకు ఒంటె, ఏనుగులతో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రోహిత్‌రెడ్డి దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

– తాండూరు

ఎడ్యుకేషన్ హబ్‌గా మహేశ్వరం

- మంత్రి సబితారెడ్డి



మహేశ్వరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కేసీ తండా సమీపంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, మోడల్ స్కూల్ హాస్టల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మహేశ్వరంలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల, కస్తుర్బా పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డైట్ కళాశాల, ఎస్టీ గురుకుల హాస్టల్, మోడల్ స్కూల్, హాస్టల్‌ను ప్రారంభించామని.. ఇటీవల సీఎం కేసీఆర్ మెడికల్ కళాశాల మంజూరు చేశారని గుర్తుచ ఏశారు. త్వరలో యూనివర్సిటీ రాబోతోందని ఆమె వెల్లడించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేటుకు దీటుగా మారుతున్నాయని తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు బి.ధనుంజయ్, భవాని, ఎంఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీయాగం



యాగంలో ఎంపీటీసీ దంపతులు

తాండూరు రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఇంటివద్ద కొనసాగుతున్న చండీయాగంలో శనివారం గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. గౌతపూర్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు ఎంపీటీసీ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మహిళ నాయకురాలు శకుంతల దంపతులు కూడా హోమంలో పాల్గొన్నారు.

సైకిల్ పలుగులకు భలే గిరాకీ



కలుపు కోత యంత్రంతో గౌస్

పెద్దేముల్: పంట సాగులో కలుపు కోతకు సైకిల్ పలుగులు ఎంతగానో ఉపయోగపడుతుండడంతో వాటికి డిమాండ్ పెరుగుతోంది. గతంలో జహీరాబాద్, పరిగి ప్రాంతాల్లో సైకిల్ పలుగులు తయారయ్యేవి. ప్రస్తుతం పెద్దేముల్ మండలం గాజీపూర్‌కు గౌస్ సైకిల్ పలుగులను తయారు చేసి విక్రయిస్తున్నాడు. ఓ సైకిల్ పలుగు రూ. 2500 నుంచి రూ.2600 వరకు విక్రయిస్తున్నాడు. ఐరన్ రేటు పెరగడంతో సైకిల్ పలుగు ధరను మరో రూ. 2 వందల పెంచినట్లు గౌస్ తెలిపారు. పెద్దేముల్, బంట్వారం, తాండూరు, బషీరాబాద్ మండలాల రైతులు సైకిల్ పలుగులు కొనుగోలు చేస్తున్నారు.

కేజీబీవీలో ఇంటర్మీడియెట్ కోర్సులు

స్పెషల్ ఆఫీసర్ కృష్ణకుమారి

షాబాద్: షాబాద్ కేజీబీవీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామీణ బాలికలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌డబ్ల్యు (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్), సీఈసీ కోర్సులు ఈ అకాడమిక్ ఇయర్ నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీలోపు విద్యార్థులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మందపై కుక్కల దాడి.. 30 గొర్రెలు మృతి



చేవెళ్ల: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన సంఘటనలో 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన చేవెళ్ల మండలం గుండాలలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం .. గుండాల గ్రామానికి చెందిన జెట్ట రామచంద్రి గొర్రెలను పోషించుకుంటూ జీవిస్తున్నాడు. దాదాపు 60 వరకు గొర్రెలు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం కూడా గొర్రెలను మేపుకొని వచ్చి ఒక చోట మందగా వేసి రాత్రి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి కొరికి చంపేశాయి. మొత్తం 30 గొర్రెలు మృతి చెందాయి.

వంటకు ధరల సెగ

- అమాంతం పెరిగిన కూరగాయల రేట్లు
- ఏది కొనాలన్నా కిలో రూ. 80 పైమాటే
- టమాటా రూ.150, పచ్చిమిర్చి రూ.120
- సామాన్యుడు కొనలేని పరిస్థితి
- సాగు విస్తీర్ణం పడిపోవడం, దిగుమతి లేకపోవడమే కారణం

కూరగాయల ధరలు(కిలోల్లో)

టమాటా	రూ.150
పచ్చి మిర్చి	రూ.120
జీరకాయ	రూ.100
కాకరకాయ	రూ.100
వంకాయ	రూ.80
బెండకాయ	రూ.50
కొత్తిమీర	రూ.100
ఆకుకూరలు	రూ.80

పరిగి: కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితికి చేరుకున్నాయి. ఏది అడిగినా రూ. 80 పైనే చెబుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతినడం, మన రాష్ట్రంలో అవసరం మేరకు దిగుబడి లేకపోవడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో రోజు రోజుకూ ధరలు పెరుగుతున్నాయి. 15 రోజులుగా ధరల ఏ మాత్రం తగ్గకపోగా పైపెచ్చు పెరుగుతున్నాయి. కూరగాయాల సాగు కూడా పడిపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని పలువురు పేర్కొన్నారు. కిలో టమాటా రూ.120 నుంచి 150 వరకు పలుకుతోంది. పచ్చి మిర్చి రూ. 120పైకి పైమాటే.

ఉత్పత్తి పడిపోవడంతోనే..

నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు కురగాయల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ కారణంగా ఉత్పత్తి పడిపోయింది. దీంతో వంటలో అధికంగా వినియోగించే పచ్చి మిర్చి, టమాటా ధరలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి నిత్యం కూరగాయలు భారీగా దిగుమతి అవుతుంటాయి. పక్క రాష్ట్రాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుమతి తగ్గి నగరానికి పచ్చి మిర్చి, టమాటాలు రావడం తగ్గిపోయింది. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతోంది.

రికార్డు స్థాయిలో రేట్లు

20 సంవత్సరాలుగా ఇంత భారీగా కూరగాయల రేట్లు ఎన్నడూ పలకలేదు. పరిగి మార్కెట్‌లో శుక్రవారం కిలో టమాటా రూ. 120నుంచి రూ. 150వరకు విక్రయించారు. పచ్చి మిర్చి రూ. 120వరకు అమ్ముతున్నారు. మిగతా కూరగాయలు కనీసం రూ. 80 పైమాటే. భారీగా రేట్లు పెరగడంతో సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజు కూలి పని చేసుకుని జీవించే వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. కూరగాయల ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



పరిగి మార్కెట్‌లో కూరగాయల విక్రయం

కొనలేకపోతున్నాం

మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాలంటే భయం వేస్తోంది. ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ. 80పైమాటే. టమాటా, పచ్చిమిర్చి లేనిదే కూర చేయలేం. కానీ వాటిని కొనలేని స్థితికి చేరాయి. కూరగాయల ధరలు మూడింతలు పెరిగాయి.

– జయమ్మ, పాలేపల్లి

భార్య కాపురానికి రాలేదని..

భర్త బలవన్మరణం

పెద్దేముల్: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం మేరకు.. తాండూరు మండలం కొత్లాపూర్‌కు చెందిన గోపాల్(32), పెద్దేముల్ మండలం జనగాం గ్రామానికి చెందిన బుజ్జమ్మ దంపతులు. 12సంవత్సరాల క్రితం వీరికి వివాహం జరిగింది. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం గొడవ జరగడంతో బుజ్జమ్మ పుట్టిళ్లు జనగాంకు వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో గోపాల్ జనగాంకు వెళ్లి భార్యను రావాలని కోరాడు. దీంతో బుజ్జమ్మ భర్తను దూషించినట్లు తెలిసింది. మనస్తాపానికి గురైన గోపాల్ జనగాం గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడు. శనివారం ఉదయం పొలాలకు వెళ్లిన కొందరు మృతదేహాన్ని చూసి పెద్దేముల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్విరామంగా ‘పీఎంఆర్’ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

- రేపటి నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం
- ఆగస్టు 30న సామూహిక వివాహాలు
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: నిర్విరామంగా పీఎంఆర్ ట్రస్ట్ సేవలు కొనసాగుతాయని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన నివాసంలో మున్సిపల్ చైర్‌పర్సన్ టీ స్వప్న పరిమళ్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మాతా శిశు కేంద్రాల్లో నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే నియోజకవర్గంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. ఆగస్టు 30వ తేదీ తాండూరులో సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వధువుకు పుస్తె మెట్టెలు ఉచితంగా అందిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 10న బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 23వ తేదీ తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని పేద దివ్యాంగులకు వాహనాల ను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. సేవా కార్యక్రమాలకు రాజకీయాలతో సంబంధం లేదన్నా రు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కరణం పురుషోత్తంరావు, తాండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, బాలాజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు శోభారాణి, అబ్దుల్ రజాక్, రవి, డీసీసీబీ డైరక్టర్ రవి గౌడ్, నాయకులు బాల్‌రెడ్డి, ప్రకాష్, మసూద్, సంతోష్‌కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

తాండూరు: పట్టణ నడిబొడ్డులో ఉన్న భావిగి భద్రేశ్వర దేవాలయం సమీపంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో బొడ్రాయి పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ టీ స్వప్న పరిమళ్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకల దేవతల ఆశీస్సులతో తాండూరు ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. పట్టణాలకు, గ్రామాలకు బొడ్రాయి ఉండాలనేది అనాధిగా వస్తున్న సంప్రదాయమన్నారు. తరాలు మారినా మన ఆచార, సంప్రదాయాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శుభప్రద్‌పటేల్ యువసేన సభ్యులు భానుప్రసాద్, విజయ్, కుర్వబాలు, సచిన్, శ్రీశైలం, ప్రశాంత్, ఉత్సవ నిర్వాహకులు నారాయణ, భాస్కర్, రవి, నర్సింహ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న స్వప్న పరిమళ్ తదితరులు

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న గుండాల గ్రామస్తులు

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

దోమ: ఆలయ నిర్మాణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చూసుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి సూచించారు. గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండాల గ్రామానికి చెందిన పలువురు పరిగిలో ఎమ్మెల్యేను కలిశారు. గ్రామంలో పోచమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసుకోవాలని, ఎదైనా అవసరం అయితే తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగత్‌రెడ్డి, రామన్న మాదిగ, అంజి రావన్ తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలోనూ తప్పడంతో..

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య



నందు(ఫైల్)

దోమ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలో ఫెయిల్ అవ్వడంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కిష్టాపూర్‌కు చెందిన కే నందు(15) పదో తరగతిలో మ్యాథమెటిక్స్ సబ్జెక్టు ఫెయిల్ అయ్యాడు. సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. అందులో కూడా ఫెయిల్ కావడంతో శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నర్సింహులుకు కుమారుడు, కూతురు ఉండగా, ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విశ్వజన్ గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగేళ్లవుతున్నా అందని నజరానా

- ఏకగ్రీవ జీపీలకు రూ.10 లక్షల హామీ బుట్టదాఖలు
- మండలంలో ఆరు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

దోమ: స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం 500 జనాభా కలిగిన తండాలు, వాటి అనుబంధ గ్రామాలకు పంచాయతీ హోదా కల్పించి 2019లో ఎన్నికలు నిర్వహించింది. ఆ సమయంలో ప్రభుత్వం ఏకగ్రీవంగా పంచాయతీలకు రూ. 10 లక్షల నజరానా ఇస్తానని ప్రకటించింది. దీంతో పంచాయతీలకు రూ. 10 లక్షలు వస్తే గ్రామం బాగుపడుతుందని భావించి ప్రజలు పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. అయితే ఎన్నికలు జరిగి నాలుగుగేళ్లు దాటినా ఇప్పటి వరకు ప్రభుత్వం నజరానా హామీని అమలు చేయలేదని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

ఆరు జీపీలు ఏకగ్రీవం

మండలంలో 2019 కంటే ముందు 21 రెవెన్యూ గ్రామ పంచాయతీలు ఉండగా, ఆ తర్వాత 15 కొత్త జీపీలు ఏర్పాటు కావడంతో మొత్తం 36కు చేరింది. అయితే ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10 లక్షల నజరానా ఇస్తామని ప్రకటించడంతో ఆరు జీపీలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో గొట్లచెల్క తండా, బడేంపల్లి, పెద్దతండా, పెద్దతండా చిన్నతండా, కిష్టాపూర్, మల్లేపల్లి, పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పెద్దతండా గ్రామ పంచాయతీ ఇండిపెండెంట్ అభ్యర్థి యునానిమస్ కాగా, మిగతా గ్రామ పంచాయతీల్లో అధికార పార్టీ సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు నజరానా ఇస్తామనడం తోపాటు స్థానిక ఎమ్మెల్యే రూ. 15 లక్షలు ఇస్తామని గతంలో హామీ ఇచ్చారు. నేటికి వాటి నిధులు రాకపోవడంతో సర్పంచులు నిరీక్షించాల్సి వస్తోంది.



గొట్లచెల్క తండా పంచాయతీ కార్యాలయం

అప్పులు చేసి పనులు

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు సరిపడం లేదు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10లక్షలు ఇస్తామని మాట ఇచ్చింది. అది ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. నాలుగేళ్లవుతున్నా ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా అందకపోవడంతో సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం నజరానా విడుదల చేయాలి. పంచాయతీలకు నిధుల కొరత ఉంది. దీంతో వీధి దీపాలు, కరెంటు బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, ట్రాక్టర్ కిస్తులు కట్టలేకపోతున్నాం. గ్రామాభివృద్ధికి అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం హామీని నిలుపుకోవాలి.

– లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్, గొట్లచెల్కతండా

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వ నజరానాకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఒకవేళ ఉత్తర్వులు వస్తే తమకు జిల్లా అధికారులను నుంచి సమాచారం అందుతుంది. దాన్ని బట్టి ఏకగ్రీవ పంచాయతీలకు నిధులను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– జయరాం, ఎంపీడీఓ, దోమ

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని నాలుగు బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) యాదయ్యగౌడ్, ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) ఆదిత్యనాథ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ సంక్షేమ గురుకుల హైదరాబాద్ (మహిళలు), మేడ్చల్ (మహిళలు), కందుకూరు (పురుషులు), వికారాబాద్ (పురుషులు, మహిళలు) డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అర్హులైన పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) పూర్తి చేసిన మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, మాథమ్యాటిక్స్, ఫిజిక్స్, బోటని, జువాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, మైక్రో బయాలజీ, జియాలజీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, హెల్త్ సూపర్ వైజర్, స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు వారు తెలిపారు. అభ్యర్థులు పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్/స్లెట్ కలిగి ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేసిన అనుభవం కలిగి ఉండాలని, అభ్యర్థులు దరఖాస్తుతోపాటు పీజీ సర్టిఫికెట్లు, పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్, స్లెట్, సర్వీసు సర్టిఫికెట్లను జత పరచాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూలకు వారిచ్చిన ఫోన్ నంబర్లకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నమూనా దరఖాస్తులను ఎంజేపీ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రత్యేక అధికారులను సంప్రదించి, పూర్తి చేసిన దరఖాస్తులను జులై 12వ తేదీ వరకు జిల్లాలోని ప్రాంతీయ సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) కార్యాలయంలో లేదా ఎంజేపీ డిగ్రీ కళా.శాలలో అందించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 99892 69715, 94900 52739, 94416 77458, 80088 05315లలో సంప్రదించాలని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామచందర్

మొయినాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొయినాబాద్‌కు చెందిన కుమ్మరి రామచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నగరంలో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని రామచంద్రర్ ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఆర్ కృష్ణయ్యను సన్మానించారు.

సర్పంచ్ తొలగింపు రాజకీయ కక్షే

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలం దుద్యాల సర్పంచ్ ఖాజాను సస్పెండ్ చేయడంలో రాజకీయ కక్ష ఉందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆరోపించారు. సర్పంచ్ తొలగింపును నిరసిస్తూ శనివారం మండలంలోని తుంకిమెట్ల జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సర్పంచ్ ఖాజా కాంగ్రెస్ పార్టీ వ్యక్తి కావడంతో బీఆర్‌ఎస్‌లో చేరలేదన్నారు. దీంతో ఆ పార్టీ నాయకులు కక్షగట్టి సస్పెండ్ చేయించారని ఆరోపించారు. నిజానికి సర్పంచ్ ఖాజా అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా ఉండాలని, అప్పులు చేసి పనులు చేయించాడని తెలిపారు. ఆయన్ను తొలగించడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖరయ్య, నాయకులు నర్సింలు గౌడ్, నర్సింలు నాయుడు, రాంచంద్రారెడ్డి, జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్నా హాస్యాస్పదం

సర్పంచ్ తరఫున కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, బీఆర్‌ఎస్ పాలనను చూసి ఓర్వలేక బురద చల్లేందుకు చూస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ ఖాజాపై వేటు వేయడం రాజకీయమైతే ఉప సర్పంచ్ నవనీత, పంచాయతీ జూనియర్ కార్యదర్శి జైపాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం కూడా రాజకీయమేనా అన్ని ప్రశ్నించారు. అధికారికంగా జరుగుతున్న చర్యలు తప్పా రాజకీయ కక్షలు లేవన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నరేశ్‌గౌడ్, బసిరెడ్డి పాల్గొన్నారు.



తుంకిమెట్ల జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

బ్రిడ్జి నిర్మాణం కలేనా ?

వర్షం వస్తే రాకపోకలు బంద్

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

తాండూరు రూరల్: వర్షాకాలం అంటేనే మండలంలోని పలు గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే వాగులు పొంగి ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో బయట గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే భయపడిపోతున్నారు. అత్యవసరం అయితే దేవుడిపై భారం వేసి వాగులు దాటే ప్రయత్నం చేస్తున్నారు.

శిథిలావస్థలో..

తాండూరు మండలంలో బెల్కటూర్, సంగెంకలాన్, అల్లాపూర్, బిజ్వార్, ఐనెల్లి, కోత్లాపూర్ గ్రామాల్లో వాగులున్నాయి. ఈ వాగులపై బ్రిడ్జీలున్నా అవి పురాతనమైనవి. ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బిజ్వార్-బొంకూర్ బ్రిడ్జీ నిర్మాణానికి రూ.4 కోట్ల 50 లక్షలు మంజూరైనా.. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. బెల్కటూర్ బ్రిడ్జికి కూడా నిధులు మంజూరయ్యాయని చెబుతున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభంకాలేదు.



తక్కువ ఎత్తులో సంగెంకలాన్ వాగుపై రోడ్డు

వాగు వస్తే అంతే సంగతి

మండలంలోని బెల్కటూర్ గ్రామం వద్ద వాగు ఉంది. బ్రిడ్జి లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వాగు పొంగిపోర్లుతుంది. ఈ వాగు వస్తే చిట్టిఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్‌తో పాటు కర్ణాటక సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సంగెంకలాన్ చుట్టూ నీరు..

వర్షం వస్తే సంగెంకలాన్ ఊరు చుట్టూ వాగు పొంగుతుంది. గ్రామానికి వెళ్లేదారిలో బ్రిడ్జి ఉంది. దీన్ని చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. పైగా బ్రిడ్జిని ఎత్తులో నిర్మించలేదు. నీటి ఉధృతి పెరిగి బ్రిడ్జిపైన కూడా వరద ప్రవహిస్తుంది. దీంతో గ్రామం నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అంతేకాకుండా ఐనెల్లి, అల్లాపూర్, బొంకూర్ బ్రిడ్జిలను కూడా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



కర్ణాటక సరిహద్దులో ఉన్న సంగెంకలాన్ చుట్టూ బండి వాగు, దిద్దివాగులు ప్రవహిస్తాయి.పెద్ద వర్షం పడిందంటే చాలు వాగులు పొంగిపోర్లుతాయి. దీంతో గ్రామం నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. బ్రిడ్జి నిర్మిస్తే సమస్య ఉండదు.

– సంజీవ్‌రెడ్డి, సంగెంకలాన్ గ్రామం